
# అసహ్యం

తాను పడీపడీ దణ్ణాలు పెట్టే ధనలక్ష్మి తనను చుట్టుముట్టి డబ్బులు దండుకునే జానపదుల జేబుల్లో ప్రత్యక్షమయితే...!




ఉదయం పది గంటలవుతోంది—

యధాప్రకారం శివరావు వంటగదికి ఓ మూలగా ఉన్న అలమారా ముందు నిలబడ్డాడు—

"త్వరగా కానివ్వండి— ఆఫీసు టైమ్ అవుతోంది" అంది అతని భార్య విమల కాస్త విసుగ్గా—

**రాజశేఖరపాండే**

శివరావు భార్యవైపు కొరకొరా చూశాడు. సరిగ్గా తను ఇక్కడ నిలబడినప్పుడే ఇలా విసుక్కోవడం అతనికి సుతరామూ నచ్చదు. అలా విసుక్కున్నప్పుడు భార్య చెంపలు ఎడాపెడా వాయించాలనుకుంటాడు గానీ దానివల్ల తర్వాత్తర్వాత జరిగే పరిణామాలు గుర్తొచ్చి అంత సాహసం చెయ్యలేకపోతున్నాడు. పైగా తను అలా అక్కడ నిల్చున్నప్పుడు అమిత శాంతంగా ఉండాలాయె! చేతులు జోడించి అలమారాలో వరసగా ఉన్న పటాలనీ, బొమ్మల్నీ చూశాడు.

రాముడు సీతారామాంజనేయుడి పటం కృష్ణుడు— పిల్లనగ్రోవి ఊదుతోన్న కృష్ణుడు సర్వాలంకార భూషితుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఫోటో, గణపతి, కుమారస్వామి, శివుడు. వగైరా దేవుళ్ళ ఫోటోలు ఒక పక్క జెంట్స్ ఫోటోలుండగా మరో పక్క లేడీ గాడెస్‌ల ఫోటోలు— వీణవాయిస్తూ సరస్వతి, శివుని మీద డాన్స్ భంగిమలో చేతులు వేసిన పార్వతి తామర పుష్పంమీద కూర్చున్న లక్ష్మీదేవి— రెండుపక్కల తొండాలతో దండలు పట్టుకున్న ఏనుగులూ—

ఇలా ఒట్టి గాడ్సే కాకుండా లేటెస్టు దేవుళ్ళ ఫోటోలు కూడా ఉన్నాయి— పుట్టపర్తి సాయిబాబా మెహర్‌బాబా జిల్లెళ్ళమూడి అమ్మవారు వగైరాల ఫోటోలు కూడా ఉన్నాయి. వీళ్లందరికీ

క్రమం తప్పకుండా రోజూ దండం పెడుతుంటాడు శివరావు— వీళ్లలో ఏ దేవుడైనా— మంచి మూడ్‌లో ఉన్నపుడు ప్లీజ్ అయిపోయి— సడన్‌గా తనకు అష్టైశ్వర్యాలు ప్రసాదించెయ్యవచ్చునని శివరావు ప్రగాఢ నమ్మకం! ఏమో ఏ పుట్టలో ఏ పాముందో— ఏ పటంలో ఏ మహాత్యం ఉందో— ఎవరు చెప్పగలరు?

నిష్టగా నిగ్రహంతో దేవుళ్లను ధ్యానించాలనుకుంటాడు శివరావు— కానీ అలా చెయ్యడం అతనికి సాధ్యంకావడం లేదు ఎంత ప్రయత్నించినా—

కళ్లు మూసుకుని ధ్యానం చేద్దామని అనుకోగానే— అతనికి ఫోటోల్లో ఉన్న దేవుళ్ల అలంకారాలు— వైభవం గుర్తొచ్చి ఒళ్లు పులకరిస్తుంది! ఠకీమని కళ్లు తెరుస్తాడు—

రాముడు— పట్టాభిషిక్తుడైన రాముడు— ఒంటినిండా ఆభరణాలు!— పక్కనే సీతమ్మతల్లి— ఆమె ఒంటినిండా ఆభరణాలే!—

సీతమ్మకు చేయిస్తి— చింతాకు పతకమూ రామ చంద్రా

ఆ పతకమునకు బట్టెను— పదివేల వరహాలు రామచంద్రా!

—పదివేల వరహాలు— అందునా బంగారపువో — వెండివో అయ్యుంటాయి ఆ వరహాలు— ఇప్పటి రూపాయల్లో అయితే ఎంత ఉంటుందో— లెక్క వెయ్యాలంటే చాలాసేపు పడుతుంది— ముందు ఆ వరహాలు బంగారమో— వెండివో తేలాలి— బంగార పువి అయితే ఎన్నికారట్లతో చేశారో— వెండి అయితే ఎన్ని తులాలో!— అది తేలాలి ముందు—

ఏదైతేనేం— కాష్— ప్యూర్ క్యాష్!— సీతమ్మగారి కేం తక్కువని రామదాసుగారు అంత క్యాషుబెట్టి— అందునా తానీషా ట్రెజరీ నుండి తస్కరించి— చింతాకు పతకం చేయించి ప్రెజంట్ చెయ్యడం?? అదే సొమ్ముతో తనలాటి నిరుద్యోగులకు నలుగురికి బోనస్‌లో— ఓ అరకాసు ఉంగరాలో ప్రెజంట్ చేసి ఉండొచ్చుగదా!—

ఈ ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతుంది శివరావుకి— రోజూ —ఇహ— శ్రీ వెంకటేశ్వరుడు — వడ్డీ కాసుల వాడు— ఆ ఫోటో చూసినప్పుడల్లా ఆయన కిరీటం మీదికే పోతోంది శివరావు చూపు— అసలాయన పొజిషనే వేరు!— అంతా క్యాష్ డీలింగ్స్!! రత్నాలు వజ్రాలు పొదిగి చేయించిన కిరీటమట!— కోట్లాది రూపాయల విలువ చేసే కిరీటం!— వహ్వా!— ఇక లక్ష్మీదేవి అబ్బో! ఆమె ఒళ్లంతా బంగారమే!— ఒళ్లంతా బంగారం దిగేసుకుని— ఉత్సవ విగ్రహాల్లా— కారుల్లో ఊరేగే గొప్పింటి ఆడాళ్లు గుర్తొస్తారు. ఆమె ఫోటో చూస్తే! పైగా చేతుల్లోనుంచి వరహాలు జారుతున్నట్లుగా ఉంది ఫోటోలో!— అంత డబ్బు వెదజల్లడానికి ఎంత కాష్ పొజిషన్ ఉండాలి? హు!— ఆవిడకేం తక్కువ—? సంపదకి గాడెస్ గదా!! ఇలా ఆ ఫోటోల్లో దేవుళ్ళ ఆభరణాలు— వాళ్ళ కాష్ పొజిషనూ లెక్కలేస్తూ —ముచ్చటపడి పోవడం శివరావుకి అలవాటయిపోయింది.

"ఏవండీ? అలా దేవుళ్ళ పటాలముందు నిలబడి గంటలు గడిపేస్తే ఎలాగ?— రోజూ మీకిదొక తంతు అయిపోయిందే!— అయినా నాకు తెలీకడుగుతాను మీరు దేవుళ్లను ధ్యానం చేస్తున్నారా— లేకపోతే తపస్సు చేస్తున్నారా? గంటలకొద్దీ ఆ ఫోటోలముందు కూర్చున్నా మనకు ఒరిగేదేముంది లెండి!—..." ఇలా సాగుతోంది అతగాడి భార్య ధోరణి

శివరాం ఏం మాట్లడలేదు— భార్యకు ఆ మాత్రం ఆలోచనా జ్ఞానం లేనందుకు చింతించాడు తనకు కులం బలం లేదు— రికమండేషన్లు లేవు— వెనక నుంచి పైకి తోసేవాళ్లు లేరు. అప్పిచ్చే వాళ్లు లేరు— కనీసం ఈ దేవుళ్ళనైనా మంచి చేసుకుంటే అకస్మాత్తుగా తను వాళ్ల మహిమల వల్ల ధనవంతుడైపోతే— పెళ్ళానికి చింతాకు పతకంగాక పోయినా ఓ రెండు పేటల గొలుసు చేయించడూ? తన తాపత్రయం కాస్తయినా అర్థం చేసుకోదేం?— తను మాత్రం ముక్తికోసం— స్వర్గప్రాప్తికోసం పాకులాడుతున్నాడా? ఏమన్నానా?

శివరాం బొత్తిగా నిరుద్యోగి. ఓ చిన్న కంపెనీలో చిన్న గుమస్తా ఉద్యోగం చేస్తున్నాడు... పేరుకి సిటీలో ఉద్యోగం— రెండు గదుల ఇల్లు— ఇంటి అద్దెకీ పాలకీ— తినడానికీ కాక రోజుకో అరపాకెట్ సిజర్ సిగరెట్లు కాల్చడానికీ. నెలకో సినిమా చూడ్డానికీ బొటాబొటిగా సరిపోతుంది అతని జీతం— అడపా దడపా అయిదో పదో తప్ప అతనికి పెద్దగా అప్పులిచ్చే వాళ్ళు లేరు.

అతను రోజూ నీట్‌గా ఉన్న మూడు జతల్లో ఒక జతను (పెళ్లాం ఉతికి ఇస్త్రీ చేయించిన జతని) వేసుకుని ఆఫీసుకు బయల్దేరతాడు. చౌరస్తా దగ్గరకు రాగానే కిష్టయ్య పాన్ దుకాణం దగ్గరకు రాగానే కిష్టయ్య అప్పుగా ఓ అరపాకెట్ సిగరెట్లు వక్కపొడిపొట్లం ఇస్తాడు. అక్కడ బస్ ఎక్కుతాడు. బస్‌పాస్ నెలకోసారి కొంటాడు గనుక రోజూ బస్సు టికెట్టుకోసం చిల్లర డబ్బులు వెతుక్కునే పరిస్థితి ఉండదు. మధ్యాహ్నం మూడు గంటలకి ఆఫీసుకాంటీన్లో ఓ రెండిడ్లీ అరకప్పు టీ (అదీ ఖాతాయే) తాగుతాడు. సాయంత్రం మళ్లీ బస్సెక్కి ఇంటికి చేరి పక్కింటి వాళ్ల తెలుగు దినపత్రిక తీసుకుని పూర్తిగా చదువుతాడు. అంతే— అదే అతని దినచర్య.


అయితే శివరావు తన పరిస్థితి ఇతరులకు తెలీకుండా చాలా బింకంగా ఉంటాడు. తన జేబులో చిల్లికానీ ఉండదని తెలిస్తే అందరూ తనను హీనంగా చూస్తారని అతనికి చచ్చేసిగ్గు. అందుకే అతను అందరితో కలివిడిగా ఉండకుండా చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటాడు. అతనెవర్నీ ఏమీ అడగడు గనుక అతన్నీ ఎవరూ ఏమీ అడగరు— అతనికి చాలా 'టెక్కు' అని ఆఫీసులో అందరూ అనుకుంటారు. అలా అనుకోవడం శివరావుకి ఇష్టం కూడా!

శివరావు ఆరోజు కూడా ఉన్న తెల్లటి డ్రస్సు నీట్‌గా టక్ చేసుకున్నాడు. అతను ఆఫీసుకు బయల్దేరుతుండగా భార్య విమల అతని వెనక నిలబడి ఏదో గొణిగింది.

"ఏమిటి గొణుగుతున్నావ్! సరిగ్గా చెప్పు" అన్నాడు శివరావు విసుగ్గా— అలా గొణిగితే భార్య తనను తిడుతోందేమోనని అతనికనుమానం.

" ఆ ఏంలేదు— కాస్త చిల్లరుంటే ఇస్తారా?—" అడిగింది విమల.

"ఏమిటా అడగడం?— చిల్లరగాని నా దగ్గరనోట్లుండి ఛస్తాయా?— నా దగ్గర ఉన్నదే



కాస్త చిల్లర— దాన్ని నువ్వు గద్దలా తన్నుకుపోతే ఎలాగ?—'' అన్నాడు శివరావు విరాగ్గా. విమల ముఖం మాడి పోయింది— ''నేనడిగింది చిల్లరేగా— ఉంటే ఇవ్వండి— లేకపోతే లేదనిచెప్పండి— దానికింత రాద్ధాంతం ఎందుకు?'' అంది విమల.

పాపం!— తను మాత్రం ఏమడిగింది? చిల్లరేగా? చిల్లరకోసం— చిల్లర తగాదాలెందుకు? తమ లాంటి చిల్లర బ్రతుకుల్లో చిల్లర త్యాగాలు చేసుకోకపోతే ఎలా? అకస్మాత్తుగా త్యాగబుద్ధి ముంచుకొచ్చింది శివరావుకి— జేబులో చెయ్యిపెట్టి వెతికాడు జేబులో పావలా— పదిపైసలు— ఓ అయిదుపైసలున్నాయ్— మొత్తం నలభై పైసలు— అబ్బో!

జేబులో ఉన్న నలభై పైసలు ఉదారంగా భార్యకు ఇచ్చేశాడు. జేబులో నయాపైసా లేకున్నా పర్వాలేదు. తను ఆఫీసుకు వెళ్ళి వచ్చేయగలడు. అయినా నలభై పైసల్తో ఏం కొనుక్కోగలడు? బీడీలు తప్ప ఏం వస్తాయి నలభై పైసలకి ఈ దేశంలో?


మళ్ళీ క్రాపు ఓ సారి దువ్వుకుని— పౌడరు మరికొంచెం ముఖానికి రాసుకుని నీట్‌గా రోడ్డుమీదకు అడుగెట్టాడు శివరావు.

రోడ్‌మీద నడిచి వెళుతున్నపుడు అందరూ తనవైపే చూస్తున్నట్లనిపించింది శివరావుకి— ఆ మధ్య తరగతి ఏరియాలో అందరూ తననే చూస్తుంటారు రోజూ— ఠంచన్‌గా పైప్‌కి— నీట్‌గా డ్రస్‌చేసుకుని— స్టైయిల్‌గా నడిచివెళ్ళే తనను చూసి— తానో అప్పర్ మిడిల్ క్లాస్ హీరో అని అందరూ అనుకుంటారని శివరావుకి తెలుసు. జేబులో ఎప్పుడూ వందరూపాయిలుంటాయని— అలా చౌరస్తాకి వెళ్ళి ఆటో ఎక్కుతాడనీ అనుకుంటారని కూడా అతనికి తెలుసు. అలా అనుకోవడం అతనికిష్టం.

పాన్‌షాప్ దగ్గరకువెళ్ళి నిలబడగానే కిష్టప్ప వినయంగా నమస్కారం పెట్టి— సిగరెట్లు— సుపారీ పాకెట్ ఇచ్చాడు. అతనో పెద్ద ఉద్యోగి అనీ అయినా సింపుల్‌గా ఉంటాడనీ కిష్టప్పకు అతనంటే గౌరవం— ఆ షాపు పక్కనే ఉన్న చాయ్ బడ్డీ యూసఫ్, మిగతా కుర్రాళ్ళు— అందరూ శివరావుకు నమస్కారం పెట్టారు. ఆ చుట్టు పక్కల వాళ్ళు నలగని తెల్లని దుస్తుల్లో ఉన్న తనంటే ఓ రకమైన క్రేజ్ ఉందని గ్రహించాడు శివరావు. ఆ క్రేజ్‌ను అలా కాపాడుకుంటూ వస్తున్నాడతను.

శివరావు సిగరెట్ వెలిగించి అలవోకగా పొగ వదుల్తూ షాపు దగ్గర నిల్చున్నాడు.

''ఇవాళ మీరు లేటయ్యారుసార్— బస్ ఇప్పుడే




వెళ్ళిపోయింది. మళ్ళీ ఇరవై నిముషాల తర్వాత గానీ మీ బస్ రాదు'' అన్నాడు కిష్టప్ప.

శివరావు గంభీరంగా తలవూపి కొట్లో ఫోటో వంక చూశాడు.

లక్ష్మీదేవి నిలువెత్తు ఫోటో ఉంది— ఆ ఫోటోకి పక్కా దండ— వరహాలురాలుస్తోన్న లక్ష్మి— గలగల లా— క్యాష్! పక్కనే వడ్డీకాసుల వాడు— ప్యూర్ గోల్డు కిరీట ధారి! నిలువెల్లాపులకించిపోతూ— ఆ ఫోటోల వంక చూస్తున్నాడు శివరావు. రోజూ అతనా ఫోటోల వంక చూస్తుంటాడు. రోజూ చూసినా తనివితీరదు ఆ ఆభరణాలను— తనువెల్లా పులకించి పోతాడతను— కొట్లో కిష్టప్ప గల్లాపెట్టి— నోట్లు— చిల్లర— పైన ఫోటోలు— బంగారు నగలు— లక్ష్మీదేవి చేతుల్లోనుంచి వరహాలు— ఆ మనోహర దృశ్యం అతనికెంతో ఇష్టం—

కాసేపు ఫోటోలవంక చూసి కదల్లేక కదల్లేక ముందుకు కదిలాడు శివరావు.

అతనలా ముందుకు వెళ్ళగానే డప్పుల మోత వినిపించింది. నలుగురైదుగురు గిరిజన స్త్రీలు పాటలుపాడుతూ అతన్ని చుట్టుముట్టారు.

సంవత్సరానికోసారి— ఏదో పండగ సందర్భంగా— ఇలా రోడ్లమీద జనాన్ని చుట్టుముట్టి— పాటలు పాడి నృత్యం చేసి డబ్బులు వసూలు చేస్తారు కొందరు గిరిజన స్త్రీలు. డబ్బులు లేవంటే వదిలిపెట్టరు నానా యాగీ చేస్తారు.

తెల్లటి బట్టల్తో మెరిసిపోతున్న శివరావును చూడగానే ఆశగా— ఆనందంగా చుట్టుముట్టారు ఆ గిరిజన స్త్రీలు—

''జంభార— జంభారహో!
జింబలకిరిహో—
హే— లగిజిగి జిగిలగి— లగిజిగి— లగిజిగి జంపా!
జంబారహో— జంబార జంబార— హో''

అని పద్మవ్యూహంలో అభిమన్యుడిని చుట్టుముట్టినట్లు ఆ బంజారా స్త్రీలు శివరావును చుట్టుముట్టారు.

''ఛీ— నా దగ్గరేంలేదు— వెళ్ళండి—'' అని సీరియస్‌గా చీదరించుకోబోయాడు కానీ వాళ్ళు వదల్లేదు.

''దయగల దొరా తెల్లబట్టలేసినవ్— దొరబాబూ— నువ్వుపైసలియ్యాలె— మేం బతకాలె— పండగ జెయ్యాలె— జబర్దస్తీగున్నవ్— పైసలియ్యెయ్ దొరా!—'' అని రణగొణ ధ్వని చేస్తూ ఆ స్త్రీలు శివరావు కాళ్ళూచేతులూ పట్టుకుంటున్నారు.


లంబాడీ దుస్తులు— బట్టలమీద చిన్నచిన్న అద్దాలు కుట్టి ఉన్నాయ్— చేతులకీ— కాళ్ళకీ డజన్లకొద్దీ దంతపుగాజులు— మెడనిండా చిత్ర విచిత్రమైన రంగుల్లో పూసలు— పాటలొకటేదో పాడుతున్నారు విచిత్ర ధ్వనులతో— మధ్య మధ్యలో ''నీ కాళ్మొక్త బాంచన్'' అని కాళ్లమీద పడుతున్నారు.

ఎరక్కపోయి ఇరుక్కున్నట్లుంది శివరావు పరిస్థితి— నిలువునా తన పరువుపోతోంది— కనుకొలకుల్లోనుంచి చుట్టూ చూశాడు శివరావు. అందరూ నవ్వుతూ ఆ దృశ్యం చూస్తున్నారు— ఆ రోడ్లో ఉన్న దుకాణాల వాళ్ళు— బస్‌స్టాప్‌లో నిలబడే వాళ్ళు— కిష్టప్ప షాపుముందున్నవాళ్ళు— యూసఫ్ చాయ్‌బడ్డీ దగ్గర చాయ్ తాగేవాళ్ళు— ఒకరేమిటి— అందరూ—

తనను మెచ్చుకోలుగా చూసేవాళ్ళు— తనకు నమస్కారం పెట్టేవాళ్ళు— అందరూ వింతగా చూస్తున్నారు— బహుశా తను ఎంతిస్తున్నాడో కూడా గమనిస్తూ ఉంటారు—

'హరి భగవంతుడా!— తనుఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తోన్న ప్రిస్టేజి ఈరోజుతో గంగలో కలిసిపోయింది—' అనుకున్నాడు శివరావు.

ఇంతకాలం తనని హీరోగా చూసే ఈ



## మీరే శివరావు అయితే ఈ కథని ఎలా ముగిస్తారు?